క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మతల్లికి బోనాలు



నర్సంపేట : పట్టణంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి బోనాల జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కూడా బోనాలకు హాజరై ప్రత్యేక పూజ చేశారు.

మడేలయ్య ఉత్సవాలు

నర్సంపేట : పట్టణంలో రజక కులస్తులు మడేలయ్య పండుగ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రజక కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని, అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

పల్లెల్లో పీరీల సందడి



చెన్నారావుపేట : మండలంలోని పల్లెల్లో పీరీల సందడి నెలకొంది. చెన్నారావుపేట, లింగాపురం, బోజెర్వు, తదితర గ్రామాల్లోని అషూర్ ఖానాలలో ఉత్సవ కమిటీల నిర్వాహకులు పీరీలను శుక్రవారం ప్రతిష్ఠించారు. అనంతరం గుండాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి హిందువులు, ముస్లిము సోదరులు డప్పుచప్పుళ్లతో పీరీలను ఊరేగించారు. ప్రజలు కుడుకలు, ఊదు, బెల్లం, దట్టీలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, నాయకులు మహ్మద్ అంకూస్, మహ్మద్ యాకూబ్ పాషా, హాజీ పాషా, అక్రమ్ పాషా, అమ్జద్ పాషా, సంతోశ్, గణేశ్, శివ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'సదరం' విజయవంతం



రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సదరం శిబిరం విజయవంతమైందని సూపరింటెండెంట్ నర్సింహస్వామి తెలిపారు. శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 73 మంది దివ్యాంగులు హాజరు కాగా వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ నర్సింహస్వామి వివరాలు వెల్లడించారు. మొత్తం 104 మంది దరఖాస్తు చేసుకోగా 73 మంది హాజరు కాగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అర్హులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నుంచి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చందునాయక్, నర్సింహారెడ్డి, వేణు, భరత్, డీఆర్‌డీఏ అధికారి పరమాత్మ, ఏపీఓ కిరణ్, శైలజ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

రాయపర్తి (వర్ధన్నపేట) : ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వర్ధన్నపేట శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లంద నుంచి దమ్మన్నపేట దిశగా కూలీలతో వెళ్తున్న ఆటోను కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో 8 మంది ప్రయాణిస్తుండగా తాండ్ర అనూశ, తాండ్ర సారమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఖానాపురం : ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడగా నలుగురికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బుధరావుపేట వైపు నుంచి వెళ్తున్న ఆటో మండల కేంద్ర సమీపంలో రోడ్డు దాటుతున్న గేదెలు తగిలి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న షకీర, డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నివాళి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటకు చెందిన సోమనర్సయ్య మృతి చెందగా అతడి మృతదేహానికి భగత్ యువజన సంఘం అధ్యక్షుడు కోరె సుధాకర్, భగత్ ఎఫ్‌పీఓ కత్తాల వెంకటేశ్వర్‌రావు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.2 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రావు, దేవేందర్‌రావు, లింగయ్య, దేవేందర్, యాకస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

బాబోయ్.. రోడ్డు పక్కనే బావులు

● ఫెన్సింగ్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : అసలే సింగిల్ రోడ్డు.. పక్కనే ప్రమాదభరితంగా వ్యవసాయ బావులు.. ఏదైనా వాహనం ఎదురుగా వస్తే పొరపాటున మరోవైపు రోడ్డు దిగితే ఇక అంతే సంగతి.. నేరుగా బావిలోకి వెళ్లడం ఖాయం.. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేస్తూ తదనంతరం విస్మరిస్తుండడంతో 'బాబోయ్.. రోడ్డు పక్కనే బావులు..' అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నర్సంపేట మండలంలోని బానోజీపేట నుంచి భోజ్యానాయక్‌తండాకు వెళ్లే రహదారి మొత్తం సింగిల్ రోడ్డు. ఆ రోడ్డు పక్కనే 5 వ్యవసాయ బావులు ఉన్నాయి. వాటిలో ప్రమాదాలు జరగకుండా ఒక బావికి మాత్రమే ఏర్పాట్లు చేశారు. మిగతా వాటిని విస్మరించడంతో రాత్రివేళల్లో ఆ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే వాహనదార్లు భయాందోళనకు గురవుతున్నారు. ఎదురుగా వాహనం వచ్చి పొరపాటున పక్కకు దిగి బావిలో పడితే మరుసటి రోజు ఉదయం వరకు ఘటన వెలుగులోకి వచ్చే అవకాశమూ లేని దారుణ స్థితి నెలకొంది. ఈ రోడ్డు మీదుగా రాత్రివేళల్లో ఎవరైనా వాహనదార్లు కొత్తగా ప్రయాణిస్తే వారికి రోడ్డు పక్కన వ్యవసాయ బావి ఉన్నట్లు తెలిసే అవకాశమే లేకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బావుల చుట్టూ చెట్ల పొదలు కమ్మేసి ఉండడంతో పరిస్థితి మరింత తీవ్రత సంతరించుకుంది. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించడంతోపాటు హెచ్చరిక బోర్డులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.





భోజ్యానాయక్‌తండాకు రోడ్డు పక్కనే బావి ఉన్న ప్రదేశం (ఇన్‌సెట్లో వ్యవసాయ బావి)

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

● నలుగురిపై కేసు నమోదు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

సంగెం : మండలంలోని పలు తండాల్లోని గుడుంబా స్థావరాలపై వర్ధన్నపేట ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ స్వరూప మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని తోట్ల తండా, వీఆర్ఎన్‌తండా శివార్లలో గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసి తయారీకి వినియోగిస్తున్న సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తొట్లతండాకు చెందిన మూడు రవి, భిక్షపతి, మధులతోపాటు వీఆర్ఎన్‌తండాకు చెందిన గుగులోత్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సరిత, సిబ్బంది రమేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీధర్

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని పోతరాజుపల్లిలో గీసుకొండ పీఏసీఎస్ ద్వారా రూ.5 లక్షల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో చేపట్టిన అభివృద్ధి పనులను సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సొసైటీ భూమి అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక నిధులతో ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు. టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సహకారంతో సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాలెపాక శ్రీనివాస్, సొసైటీ వైస్‌చైర్మన్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్, యాదగిరి, సురేశ్, మాణిక్యం, మాజీ సర్పంచ్ పుస్కుల వీరమల్లు, నాయకులు మంద బాబూరావు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువతకు మేలు



చికెన్ బజార్‌ను ప్రారంభిస్తున్న దేవేందర్‌రావు

రాయపర్తి (వర్ధన్నపేట) : స్వయం ఉపాధితో యువతకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు తెలిపారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో రియాజ్ అనే యువకుడు ఏర్పాటు చేసుకున్న మదీన చికెన్ బజార్‌ను దేవేందర్‌రావు అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే వ్యాపారాలపై దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి చేరవచ్చని చెప్పారు. వ్యాపారంలో ఎంత కష్టపడితే అంత లాభం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మడ్డి రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకటేశ్వర్లు, మహమ్మద్ చోటే, గద్దం సమ్మయ్య, కుమారస్వామి, తాళ్లపెల్లి శ్రీనివాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలి

రాయపర్తి (వర్ధన్నపేట) : వెంటనే డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) జిల్లా కార్యదర్శి వల్లం దాస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలో ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ఈరెల్లి శ్రీనివాస్, అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహిత బిర్రు కుమారస్వామిలతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమార్ మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థుల మానసిక సన్నద్ధత, ప్రిపరేషన్, సిలబస్‌లను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థి నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలు వాయిదా వేయాలని కొద్దిరోజులుగా అభ్యర్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. వేర్వేరు సిలబస్‌లతో కూడిన టెట్, గ్రూప్–1, హెచ్‌డబ్ల్యూఓ, డీఎస్సీ వరుసగా నిర్వహిస్తుంటే అభ్యర్థులు సరైన సన్నద్ధత లేక వేదనకు గురవుతున్నారని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మీడియాపై దాడులను ఖండించాలని కోరారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించండి

నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి, ఇతర మౌలిక సదుపాయాలు కొరవడడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. డివిజన్ కేంద్రంలోని హాస్టళ్లలోనూ వసతులు కల్పించడంతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ బిల్లులు పెంచి విడుదల చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేయాలని, సమయపాలన పాటించని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం డివిజన్ కమిటీ సభ్యులు రాకేశ్, వంశీ, విజయ్‌కుమార్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కరువు

నల్లబెల్లి : రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుడు బానోత్ సంగూలాల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడచినా దళితులపై ఇంకా దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయని చెప్పడానికి అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్య నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ కరువైందని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలను కఠినతరం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు.

చేయూత

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఓరుగంటి సారయ్య (35) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూత అందించారు. తొలుత సారయ్య మృతదేహానికి శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బిల్లా వెంకట్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, ఉల్లెంగుల యాదగిరి, గాడిపెల్లి రాములు, మహేందర్‌రెడ్డి, గాడిపెల్లి మల్లయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



దుగ్గొండి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా నీలోజు వెంకటేశ్వర్లు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై జక్కుల పరమేశ్ వరంగల్ వీఆర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో వంగర ఎస్సైగా పని చేసిన వెంకటేశ్వర్లును ప్రభుత్వం బదిలీ చేసింది. ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైగా ప్రశాంత్ బాబు..



నల్లబెల్లి: నల్లబెల్లి ఎస్సైగా ప్రశాంత్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఐటీ సెల్‌లో పని చేస్తూ బదిలీపై నల్లబెల్లి ఎస్సైగా వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఎస్సై రామారావు సుబేదారి ఎస్సైగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ప్రశాంత్ బాబుకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

హార్టికల్చర్ అధికారిగా తరుణ్



నెక్కొండ : నెక్కొండ డివిజన్ హార్టికల్చర్ అధికారిగా తరుణ్ నియమితులయ్యారు. మండల కేంద్రంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉద్యాన రైతుల పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రైతులు ఉద్యాన పంటలు, వ్యవసాయ పద్ధతులకు సంబంధించి సకాలంలో మార్గదర్శకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 8977714053ను సంప్రదించాలని సూచించారు.

క్రీడా సామగ్రి అందజేత

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కృష్ణ, సుజాత విద్యార్థులకు శుక్రవారం రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. అనంతరం హెచ్ఎం విజయ మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న తహసీల్దార్ ఫణికుమార్

చెన్నారావుపేట : సమాజంలోని ప్రతీఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని తహసీల్దార్ ఫణికుమార్ కోరారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటింటా మొక్కలు నాటి వనసంపదను కాపాడుకోవాలని సూచించారు. తొలుత విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది విజయ గోపాల్‌రెడ్డి, హెచ్ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, జక్కుల జగదీశ్వర్, మేడి రమేశ్‌గౌడ్, కొండపర్తి కృష్ణమోహన్, వల్ల వేణు, గణేశ్, భద్రు, కందిక నవీన్, చేరాలు, రాజు, కుమారస్వామి, వీరాచారి, జున్నూతుల కవిత, సృజన, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రకాశ్

దుగ్గొండి : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మల్లంపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లోని రికార్డులను పరిశీలించారు. బాలింతలు, గర్భిణుల నమోదు, వర్షాకాలంలో గ్రామాల వారీగా తీసుకుంటున్న చర్యలు, పారిశుద్ధ్య వివరాలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కిరణ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు బదిలీతో ముదిరాజ్‌లకు లబ్ధి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అశోక్‌కుమార్, తదితరులు

రాయపర్తి (వర్ధన్నపేట) : చేపపిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ చేస్తే ముదిరాజ్ వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమ పోస్టర్లను వర్ధన్నపేటలో ఆయన గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–'ఏ' లోకి మార్చాలని, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని, చెరువులతోపాటు కుంటలపై ముదిరాజ్ కులస్తులకు సంపూర్ణ హక్కులు కల్పించాలని, త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ కుల నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరోటి సదానందం, నాయకులు కోటి, చెవ్వ కాశీనాథం, అల్లాడి నర్సయ్య, గుండా రాకేశ్, భూష సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖానాపురం : ఈనెల 14న వరంగల్‌లో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు రాధక్క సంతాప సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో ఆ పార్టీ డివిజన్ నాయకుడు గట్టి కృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా, ప్రజాసమస్యల పరిష్కారానికి విప్లవ పోరాటాలు జరుగుతున్నాయని చెప్పారు. పాలకుల తప్పుడు విధానాలపై రాధక్క స్ఫూర్తితో ప్రజాపోరాటాలు నిర్మించాలని కోరారు. సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, సులోచన, సుజాత, రమేశ్, నర్సయ్య, సుజాత, రవి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కర్ర'ంటు స్తంభాలే దిక్కు

● విద్యుత్ తీగలు అస్తవ్యస్తం

నల్లబెల్లి : ఎన్పీడీసీఎల్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలకు కర్ర స్తంభాలే దిక్కయ్యాయి. వేలాడుతున్న విద్యుత్ తీగలను గత వేసవిలోనైనా సరి చేస్తారని ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలింది. కొన్ని చోట్ల చేతికందే ఎత్తులోనే విద్యుత్ తీగలు ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాలకు కూడా సపోర్ట్ పోల్స్ లేకపోవడంతో అవి పక్కకు ఒరిగి ఎప్పుడు పడిపోతాయో తెలియని దుస్థితి నెలకొనడం గమనార్హం. పలు ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు శిధిలావస్థలో దర్శనమిస్తుండగా వాటికి రైతులు కర్రలను సపోర్టుగా ఏర్పాటు చేసుకున్న పరిస్థితి కనపడుతోంది. కర్ర స్తంభాలను ఏర్పాటు చేసుకోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. ధర్మారావుపల్లికి చెందిన రైతు ఐలయ్య తన పంట భూముల్లో విద్యుత్ వైర్లు వేలాడుతుండగా సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అయినా స్పందన లేకపోవడంతో వేలాడుతున్న విద్యుత్ తీగలకు కర్రలను సపోర్ట్‌గా ఏర్పాటు చేసుకున్నాడు. ఇకనైనా ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లోనూ అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



సపోర్టుగా రైతు ఏర్పాటు చేసుకున్న కర్ర స్తంభం

విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి



మా పొలంలో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని పొలం పనులు చేసుకుంటున్నాం. విద్యుత్ తీగలు తగిలి ప్రాణాపాయం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారు. వేసవిలో సమస్యను పరిష్కరిస్తారని ఆశించగా నిరాశే మిగిలింది. అధికారులు నిర్లక్ష్యం వీడి ఇకనైనా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలి.

-ఐలయ్య, రైతు, ధర్మారావుపల్లి

సమస్యను పరిష్కరిస్తాం

ధర్మారావుపల్లిలో కర్ర స్తంభాన్ని రైతు ఏర్పాటు చేసుకున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇతర గ్రామాల్లోనూ పరిశీలిస్తాం. ఎక్కడ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయో గుర్తించి త్వరలోనే అన్ని చోట్లా సరి చేస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

-రాజు, ఇన్‌చార్జ్ ఏఈ, ఎన్పీడీసీఎల్

విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ



బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం భద్రయ్య

చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన మంచాల సదయ్య, భాషాబోయిన రమేశ్ శుక్రవారం 200 నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆంగోతు భద్రయ్య మాట్లాడారు. గ్రామంలోని బడుగు బలహీన వర్గాల పిల్లలకు తన వంతుగా సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోని చదువులో రాణించాలని సూచించారు. దాతలు విద్యార్థుల అవసరాలు గుర్తించి సహాయ సహకారాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, రాణి, సత్యనారాయణ, స్వామి, యాకయ్య, పావని, తదితరులు పాల్గొన్నారు.